క్లుప్తంగా

మురుగునీటితో ఇబ్బందులు


నెరవాడలో రోడ్డుపై నిలిచిన మురుగునీరు

పాణ్యం: మండల పరిధిలోని నెరవాడ గ్రామంలో మురుగునీటి సమస్య తీవ్రంగా మారింది. గ్రామంలోని పుట్టాలమ్మ ఆలయానికి వెళ్లే దారిలో సీసీ రోడ్డుపై మురుగునీరు చేరి రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతోంది. కాల్వలు పూడిపోవడంతో నీరు బయటకు వెళ్లే మార్గం లేక రోడ్డుపైనే నిల్వ అవుతోంది. దీంతో దుర్వాసన వ్యాపించి గ్రామస్తులు ఇబ్బందులు పడుతున్నారు. మురుగు నీరు వెళ్లేందుకు మార్గం కల్పించి సమస్యను పరిష్కరించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

బ్రిడ్జి వద్ద కొమ్మల తొలగింపు


చెట్టు కొమ్మలను తొలగిస్తుండడంతో నిలిచిన వాహనాలు

పాణ్యం: మండల కేంద్రంలోని జుర్రాగు వద్ద కొత్తగా నిర్మించిన బ్రిడ్జిపై వాహన రాకపోకలకు అడ్డంకులు ఏర్పడ్డాయి. దీంతో బ్రిడ్జి వద్ద రోడ్డుకు అడ్డుగా ఉన్న భారీ చెట్టు కొమ్మలను అధికారులు ఆదివారం తొలగించారు. ఈ క్రమంలో వాహనాలను కొంతసేపు నిలిపివేసి మొద్దులను తొలగించగా, అనంతరం రాకపోకలు యథావిధిగా కొనసాగాయి.

ఉచిత వైద్య శిబిరం


వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న సిబ్బంది

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామంలో సర్పంచ్ బీఎస్ రామ్మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో ఇండస్ గుండె ఆస్పత్రి డాక్టర్లు ఆదివారం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. డాక్టర్లు మురళీకృష్ణ రమేష్, తనూజ వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి స్కానింగ్‌లు, ఉచితంగా మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఉప సర్పంచ్ గొదా ప్రసాద్, తదితరులు పాల్గొన్నారు.

దెబ్బతిన్న వంద అడుగుల రోడ్డు


కోతకు గురైన రోడ్డు


కల్లూరు: కర్నూలు నగరంలోని దిన్నెదేవరపాడు రోడ్డు నుంచి నంద్యాల రోడ్డును కలిపే వంద అడుగు రోడ్డు అక్కడక్కడ దెబ్బతింది. ఈ రోడ్డుపై నిత్యం వందల మంది ప్రయాణికులు ప్రయాణిస్తుంటారు. ఇరువైపులా ఉన్న రోడ్డు దెబ్బతినడంతో ఎదురుగా వచ్చే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ద్విచక్ర వాహనదారులు భయం భయంగా ప్రయాణించాల్సిన పరిస్థితి. అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

బైక్‌లు ఢీకొని ముగ్గురికి గాయాలు


గాయపడిన వెంకటేశ్వర్లు

గడివేముల: మండల పరిధిలోని గడిగరేవుల గ్రామ సమీపంలో రెండు బైక్‌లు ఢీకొనడంతో ముగ్గురు గాయపడ్డారు. నంద్యాల మండలం వైఎస్సార్ నగర్‌కు చెందిన వడ్డె గుర్రప్ప, సముద్రాల వెంకటరమణ బైక్‌పై సొంత గ్రామానికి వెళ్తుండగా నందిమూరినగర్‌కు చెందిన వెంకటేశ్వర్లు పని నిమిత్తం గడివేముల వైపు వస్తుండగా ఎదురెదురుగా బైకులు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో వెంకటేశ్వర్లుకు తీవ్ర గాయాలు కాగా మిగిలిన ఇద్దరికి గాయాలయ్యాయి. వారిని 108 అంబులెన్స్‌లో నంద్యాలకు తరలించారు. ఈ ఘటనపై పోలీసులు వివరాలు సేకరిస్తున్నారు.

గాడిచెర్లకు నివాళి


గాడిచెర్ల చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గ్రంథాలయాధికారి

ఓర్వకల్లు: గ్రంథాలయ ఉద్యమ పితామహుడు, భారత స్వాతంత్ర్య సమరయోధుడు గాడిచెర్ల హరిసర్వోత్తమరావు జయంతిని ఆదివారం ఘనంగా నిర్వహించారు. మండలంలోని నన్నూరు శాఖ గ్రంథాలయంలో కౌసల్య ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి నివాళులర్పించారు. గ్రంథాలయాల స్థాపన కోసం హరిసర్వోత్తమరావు చేసిన కృషిని కొనియాడారు. అనంతరం పిల్లలకు మిఠాయిలు పంపిణీ చేశారు.

పొలాల్లో నిలిచిన నీరు.. రైతుకు కన్నీరు

- భారీ వర్షాలతో నీట మునిగిన పంటలు
- వర్షాలు ఆగినా పొలాల నుంచి తొలగని నీరు
- పంటలు కుళ్లిపోతాయని రైతుల ఆందోళన

పాణ్యం: రెండు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు మండలంలో పలు పంటలు నీట మునిగాయి. వరి, పొగాకు, మొక్కజొన్న, మిరప పొలాల్లో నీటి నిల్వలతో రైతులు ఆందోళ చెందుతున్నారు. నెరవాడ, భూపనపాడు, కొలూరు గ్రామాల్లో పొగాకు, మిరప పంటలు నీటిపాలవడంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. పొలాల్లో మూడు రోజులుగా నిల్వ ఉన్న నీటి కారణంగా ఇప్పటికే మిరప, పొగాకు నారు కుళ్లిపోవడం ప్రారంభమైందని రైతులు చెబుతున్నారు. ఎడతెరిపి లేకుండా వర్షాలు కురుస్తుండడంతో పరిస్థితి మరింత దారుణంగా మారుతుందనే భయాలు వ్యక్తమవుతున్నాయి. మండలంలో దాదాపు 100 ఎకరాలపైనే పొగాకు సాగు జరుగుతుండగా, అధిక వర్షాల వల్ల సాగు సీజన్ ప్రారంభంలోనే రైతుల కష్టాలు పెరిగాయి. అదేవిధంగా సోయాబీన్ పంట ఆకుపచ్చనుంచి పసుపు రంగులోకి మారిపోతుండగా, మిరప పంట కూడా దాదాపు 500 ఎకరాల్లో తీవ్రంగా దెబ్బతింటుందని రైతులు ఆందోళన చెందుతున్నారు.


భూపనపాడులో నీట మునిగిన మిరప పైరు


అధిక నీటితో పసుపు రంగులోకి మారిన గొరుచిక్కుడు పంట


వర్షపు నీటిలోనే పొగాకు పంట

నీటిలోనే మిరప పైరు

మూడురోజులుగా నీటిలోనే మిరప పంట ఉంది. నాలుగు ఎకరాల్లో సాగు చేశాను. ఎకరానికి రూ.30 వేలు పెట్టుబడి పెట్టాను. అందులో రెండు ఎకరాల్లో మొక్కలు నీటిలో మునిగిపోయాయి. ఇలాగే ఉంటే పంట మొత్తం నష్టమవుతుంది.

– శివ, రైతు, భూపనపాడు

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

పాణ్యం: మండల కేంద్రంలోని డొంగు వద్ద ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలైనట్లు 108 సిబ్బంది తెలిపారు. నంద్యాలకు చెందిన అరుణ్‌కుమార్ బైక్‌పై కర్నూలుకు వెళ్తుండగా, కుక్క అడ్డురావడంతో బైక్ అదుపుతప్పి కిందపడ్డారు. సమాచారం అందుకున్న 108 సిబ్బంది గాయపడిన అతడిని పాణ్యం సీహెచ్‌సీకి తరలించారు.

నేడు ఎస్‌జీఎఫ్ ఎంపిక పోటీలు

కర్నూలు (టౌన్): స్థానిక స్పోర్ట్స్ అథారిటీ ఔట్‌డోర్ స్టేడియంలో సోమవారం స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్ -19 విభాగంలో ఎంపిక పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ అండర్-19 జిల్లా కార్యదర్శి కె.రాఘవేంద్ర ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. పోటీల్లో భాగంగా జూడో, నెట్‌బాల్, కలరియపట్టు అలాగే స్థానిక అశోక్‌నగర్ ఆర్‌కే అకాడమీలో రైఫిల్ షూటింగ్ విభాగాల్లో ఎంపిక పోటీలు ఉంటాయని వెల్లడించారు. ఎంపిక పోటీలకు హాజరయ్యే విద్యార్థులు సంబంధిత పాఠశాల ప్రధానోపాధ్యాయుల సంతకంతో హాజరు కావాలని సూచించారు. లీప్ యాప్‌లోను క్రీడాకారులు తమ పేర్లను తప్పనిసరిగా నమోదు చేసుకోవాలన్నారు.

పొంచి ఉన్న ప్రమాదం


దెబ్బతిన్న కాల్వర్టు

కల్లూరు: నగరంలోని కృష్ణానగర్ ఐటీసీ కూడలి సమీపంలో ఉన్న శరీన్‌నగర్, రాఘవేంద్రనగర్ తదితర కాలనీల నుంచి సర్వీస్ రోడ్డు కాల్వర్టు వద్ద గుంత ఏర్పడి రోడ్డు దెబ్బతింది. సుమారు 20 రోజులైన ఇంతవరకు అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదని వాహనదారులు వాపోతున్నారు. ప్రమాదం పొంచి ఉందని ప్రయాణికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఈ రోడ్డుపై నిత్యం వందల వాహనాలు తిరుగుతుంటాయి. ఎక్కువగా కార్మికులు ద్విచక్రవాహనాలు, ఆటోల ద్వారా ప్రయాణిస్తుంటారు. రోడ్డు మలుపు దగ్గర కాల్వర్టుపై గుంత ఉండడంతో వాహనదారులు ఏమాత్రం అదుపు తప్పినా గుంతలో పడాల్సిందే. రాత్రి సమయంలో ప్రమాదాలు జరిగే అవకాశం ఉంది. సంబంధిత అధికారులు స్పందించి దెబ్బతిన్న కాల్వర్టుకు మరమ్మతులు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.

పీజీఆర్ఎస్‌ను సద్వినియోగం చేసుకోండి

గడివేముల: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ వెంకటరమణ కోరారు. మండలంలోని ఆయా గ్రామాల్లో ఉన్న సమస్యలను సంబంధిత అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో మండలస్థాయి అధికారులందూ అందుబాటులో ఉంటారన్నారు.

పరిష్కార వేదికకు అధికారులందరూ హాజరవ్వాలి

సి.బెళగల్: ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్) కార్యక్రమానికి మండలంలోని అన్ని శాఖల అధికారులందరూ తప్పనిసరిగా హాజరవ్వాలని తహసీల్దార్ వెంకటలక్ష్మి ఆదేశించారు. ఆమె ఆదివారం ఓ ప్రకటనలో వెల్లడిస్తూ.. ప్రజా సమస్యలను తెలుసుకునేందుకు స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రతి సోమవారం మండలంలోని అన్ని శాఖల అధికారులతో కలిసి పీజీఆర్ఎస్ కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని, మండల అధికారులందరూ తప్పకుండా హాజరు కావాలని సూచించారు. హాజరుకాని అధికారులపై ఉన్నతాధికారులకు నివేదిక పంపడం జరుగుతుందని పేర్కొన్నారు.

యోగా గ్రేడ్-1 న్యాయనిర్ణేతలుగా జిల్లావాసులు

కర్నూలు (టౌన్): యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో హర్యానా వేదికగా ఆదివారం నిర్వహించిన ఆన్‌లైన్ గ్రేడ్-1 న్యాయ నిర్ణేతల పరీక్షల్లో జిల్లావాసులు డాక్టర్ ఎస్.ముంతాజ్ బేగం, కురువ మునిస్వామి అర్హత సాధించినట్లు రాష్ట్ర యోగా సంఘం చైర్మన్ దండు లక్ష్మీకాంత రెడ్డి ఆదివారం ఒక ప్రకటనలో వెల్లడించారు. వీరిద్దరూ జాతీయ స్థాయిలో ప్రతిభ కనబరచడంపై జిల్లా యోగా సంఘం అధ్యక్షుడు అవినాష్ శెట్టి, జిల్లా సంఘం ఉపాధ్యక్షుడు సాయిక్రిష్ణ, శశిధర్, శ్రీనివాసులు, విజయకుమార్ హర్షం వ్యక్తం చేశారు.

భగవద్గీతపై ప్రచారం


భగవద్గీతపై ప్రచారం చేస్తున్న కమిటీ సభ్యులు

ఓర్వకల్లు: మతాలు, కులాలు అహేతుకమని, కర్మయోగం, భక్తియోగం, బ్రహ్మయోగం అనుసరించాలన్నదే గీత బోధ అని త్రైత సిద్ధాంత ప్రబోధ సేవా సమితి అధ్యక్షుడు కె.రామచంద్రుడు అన్నారు. ఆదివారం హుసేనాపురం గ్రామంలో ఇందూ జ్ఞాన వేదిక ఆధ్వర్యంలో భగవద్గీత ప్రచారం చేపట్టారు. మన శరీరంలో జీవాత్మ, ఆత్మ, పరమాత్మ రూపంలో దేవుడు విభజించబడి ఉన్నాడని, ఈ జ్ఞానం తెలుసుకోవడమే త్రైత సిద్ధాంత ముఖ్య ఉద్దేశమని తెలిపారు. అనంతరం కరపత్రాలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సమితి సభ్యులు గోకారి, శ్రీను, రాఘవేంద్ర, సుబ్బలక్ష్మి, సుజాత, హైమావతి, రమణమ్మ, రంగమ్మ తదితరులు పాల్గొన్నారు.


సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు ఉధృతం

- ప్రభుత్వం ఏర్పాటు చేసిన భవ్య హెల్త్ సర్వీసేస్ వేతనాలు తగ్గించింది
- 3 నెలల నుంచి వినతి పత్రాలు ఇస్తున్నా స్పందన లేదు
- 104 అంబులెన్స్ ఉద్యోగుల నిరసన


ఎమ్మెల్యే బి.దస్తగిరికి వినతిపత్రం అందిస్తున్న 104 అంబులెన్సు ఉద్యోగుల కమిటీ నాయకులు

కర్నూలు(రూరల్): కూటమి ప్రభుత్వం ఏర్పాటు చేసిన 104 భవ్య హెల్త్ సర్వీసెస్ ప్రైవేట్ లిమిటెడ్ యాజమాన్యం ఉద్యోగుల వేతనాలు తగ్గించిందని, దీనిపై మూడు నెలలుగా సంస్థ యాజమాన్యం, రాష్ట్ర వైద్యాశాఖ ఉన్నతాధికారులకు అనేక సార్లు వినతి పత్రాలు ఇచ్చినా స్పందన లేదని ఉద్యోగులు వాపోయారు. తమ సమస్యలు పరిష్కరించకుంటే ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని అంబులెన్సు ఉద్యోగుల కమిటీ జిల్లా ఉపాధ్యక్షులు కళ్యాణి, ట్రెజరర్ చంద్రహాస్ తదితరులు ఆదివారం పసుపుల గ్రామంలో ఎమ్మెల్యే బి.దస్తగిరిని కలిసి వినతిపత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ.. తగ్గించిన వేతనాన్ని తిరిగివ్వాలని, ఉద్యోగులకు స్లాబ్ సిస్టమ్ అమలు చేయాలని, నిబంధనల ప్రకారం సెలవులు వర్తింపజేయాలని కోరారు. సరిపడా సిబ్బందిని నియమించి పని భారం తగ్గించాలని, కండిషన్‌లో లేని వాహనాలను తక్షణం మార్పుచేసి, ఫిట్‌నెస్ పరీక్షలు చేయించాలన్నారు. అలాగే రూ.10 లక్షల ప్రమాద బీమా కల్పించాలని కోరారు. మాజీ యాజమాన్యం అరబిందో నుంచి రావాల్సిన బకాయిలను ఇప్పించి, ఉద్యోగులకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని కోరారు. వీరితో పాటు రాజేష్, సుమంత్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మైసమ్మ తల్లి చల్లగా చూడమ్మా


ప్రత్యేక అలంకరణలో మైసమ్మ


బోనాలను ఊరేగింపుగా తీసుకొస్తున్న భక్తులు

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని సూదిరెడ్డి పల్లెలో ఆదివారం గ్రామ దేవత మైసమ్మ గ్రామోత్సవం ఘనంగా నిర్వహించారు. ప్రతి సంవత్సరం అమ్మవారికి గ్రామోత్సవం జరిపించడం ఆనవాయితీగా వస్తోందని గ్రామ పెద్దలు తెలిపారు. ఉత్సవం సందర్భంగా ఆలయాన్ని విద్యుద్దీపాలు, పులతో సుందరంగా అలంకరించారు. స్వాగత తోరణాలు కట్టారు. వేకువజాము నుంచి అమ్మవారికి కుంకుమార్చన, ఆకుపూజ నిర్వహించారు. మహిళలు నియమ నిష్ఠలతో బోనాలకు ప్రత్యేకంగా అలంకరణ చేసి, పసుపు, కుంకుమ, టెంకాయ, నిమ్మకాయల దండలతో అలంకరించి భక్తిశ్రద్ధలతో ఊరేగింపుగా ఆలయానికి చేరుకొని డప్పు దరువుల మధ్య ప్రదక్షిణలు చేసి అనంతరం అమ్మవారికి సమర్పించారు. పిండి వంటలు, భక్ష్యాలు, గుగ్గిళ్లను అమ్మవారికి నైవేద్యంగా పెట్టారు. గ్రామస్తులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు.

వాస్తవాలతో జర్నలిజం కొనసాగించాలి

కర్నూలు(సెంట్రల్): ప్రజలకు ప్రయోజనం కలిగే వాస్తవాలతో జర్నలిజం కొనసాగించాలని సీఆర్ మీడియా అకాడమీ చైర్మన్ ఆలపాటి సురేష్‌కుమార్ సూచించారు. ఆదివారం మౌర్య ఇన్‌లోని పరిణయ ఫంక్షన్ హాలులో గ్రామీణ విలేకరుల రెండో రోజు పునశ్చరణ తరగతులు జరిగాయి. ముగింపు సభలో ఆయన మాట్లాడుతూ.. విలేకరులు గౌరవంతో పనిచేయాలని, స్థాయిని తగ్గించుకునే విధంగా ప్రవర్తన ఉండకూడదన్నారు. ఆత్మవిమర్శ చేసుకొని జర్నలిస్టుగా రాణించాలన్నారు. కర్నూలు పార్లమెంట్ సభ్యుడు బస్తిపాటి నాగరాజు మాట్లాడుతూ.. జర్నలిజం చాలా గొప్పదని, తన దినచర్య పత్రికలు చదవడంతోనే ప్రారంభమవుతుందన్నారు. విలేకరులు శాస్త్ర సాంకేతిక అంశాలను తెలుసుకొని వృత్తి నైపుణ్యాలను పెంపొందించుకోవాలన్నారు. అడిషినల్ ఎస్పీ హుస్సేన్ పీరా మాట్లాడుతూ.. సోషల్ మీడియా యుగంలో సమాచారం సంక్షిప్తంగా, సూటిగా ఉండేలా చూసుకోవాలన్నారు. సమాచార డీడీ జయమ్మ, రిసోర్స్ పర్సన్‌లు సుందరం, శంకర నారాయణ, ఉమా మహేశ్వరరావు, ఐవీ సుబ్బారావు, శ్రీనివాస రెడ్డి, కొండప్ప, రాజు, నాగరాజు గౌడ్ పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్


ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

కర్నూలు(రూరల్): మండల పరిధిలోని గార్గేయపురం గ్రామంలో దిగువపాడు కూడలి వద్ద ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ ప్రమాదకరంగా మారింది. ట్రాన్స్‌ఫార్మర్ దిమ్మెను గతంలో ఆర్టీసీ బస్సు ఢీకొట్టడంతో తాత్కాలికంగా రాళ్లను పేర్చి వాటిపై ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్ శాఖ వారు ఏర్పాటు చేశారు. ఫ్యూజ్ బోర్డులు తక్కువ ఎత్తులో ఉండటం, రోడ్డు పక్కనే ట్రాన్స్‌ఫార్మర్ ఉండటం వల్ల అటువైపుగా వెళ్లేవారు, పశువులను తోలుకుపోయేవారు రాకపోకలు సాగించేందుకు జంకుతున్నారు. ఈ ప్రాంతం చుట్టు పక్కల గ్రామాలకు వెళ్లేందుకు కూడలి కావడం, బస్టాప్ ఉండటంతో జనం ఎప్పుడూ రద్దీగా ఉంటారు. బస్సుల కోసం ఎదురు చూసే విద్యార్థులు, కూలీలు, ఉద్యోగులు, వ్యాపారులు నిత్యం ఇక్కడ బస్సులు, ఆటోల కోసం వేచి చూస్తుంటారు. ఎదైనా వాహనం అదుపుతప్పి ట్రాన్స్‌ఫార్మరును తగిలినా, వైర్లు ఉడి రోడ్డుపై పడినా పెను ప్రమాదం తప్పదు. ఇప్పటికైనా విద్యుత్ శాఖ అధికారులు చర్యలు చేపట్టి ట్రాన్స్‌ఫార్మర్‌ను ఇక్కడి నుంచి మార్చాలని స్థానికులు కోరుతున్నారు.

● సారూ.. రోడ్లను బాగు చేయరూ!


కోడుమూరు ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్‌లో గుంతలు పడిన రోడ్డు

కోడుమూరు రూరల్: కోడుమూరులోని ఆర్‌టీసీ బస్టాండ్ సర్కిల్, ఎమ్మిగనూరు రోడ్డులో భారీ గుంతలేర్పడడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేయాల్సిన ఆర్‌అండ్‌బీ అధికారులు కేవలం మట్టి వేసి చేతులు దులుపుకుంటుండడంతో చిన్నపాటి వర్షం పడితే చాలు రోడ్లపై తిరిగి గుంతలేర్పడుతున్నాయి. దీంతో రోడ్లపై పడ్డ గుంతలను గమనించకుండా వెళ్లి వాహనదారులు ప్రమాదాల బారిన పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి దెబ్బతిన్న రోడ్లకు మరమ్మతులు చేసి తమ ఇబ్బందులు తీర్చాలని వాహనదారులు కోరుతున్నారు.

● వరద పాయే.. చేపలు చిక్కే!

కోడుమూరు రూరల్: కోడుమూరు హంద్రీ నదికి గాజులదిన్నె ప్రాజెక్టు నుంచి నీటి విడుదలను నిలిపేయడంతో ఆదివారం పట్టణానికి చెందిన యువకులు జోరుగా చేపల వేట కొనసాగించారు. నీటిని విడుదల చేసిన సమయంలో ప్రాజెక్టు నుంచి చేపలు భారీగా నదిలోకి చేరతాయి. దీంతో యువకులు పోటీ పడుతూ నదిలో ఎక్కడికక్కడ గాలాలు వేసి మరీ చేపల వేట సాగించారు. ఒక్కో చోట ఐదారు మంది యువకులు గుంపుగా కూర్చొని ఓపికగా గాలాలు వేస్తూ కిలోలకొద్ది చేపలను పట్టారు. దీంతో నదీని చూసేందుకు వచ్చిన ప్రజలు సైతం యువకుల చేపల వేటను ఆసక్తిగా గమనించారు.


గాలానికి చిక్కిన చేప


చిక్కిన చేపలు


కోడుమూరు హంద్రీ నదిలో గాలాలు వేసి చేపలు పడుతున్న వ్యక్తులు

నేరప్రవృత్తికి దూరంగా ఉండాలి


రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇస్తున్న పోలీసు అధికారులు

కర్నూలు(అగ్రికల్చర్): నేరప్రవృత్తికి స్వస్తి పలికి మంచి మార్గంలో పయనించే విధంగా పోలీసు అధికారులు రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలోని అన్ని పోలీసు స్టేషన్లలో రౌడీషీటర్లకు కౌన్సెలింగ్ ఇచ్చారు. నేరాల నియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు యంత్రాంగం రౌడీ షీటర్లలో మార్పు తీసుకురావడం లక్ష్యంగా కౌన్సెలింగ్ నిర్వహించడం విశేషం. చెడు నడతను వదులుకోవాలని, మంచి అలవాట్లు, పద్ధతులు అలవర్చుకొని సత్ప్రవర్తనతో రాణించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు పాల్పడుతూ జీవితాలను నాశనం చేసుకోవద్దని హితవు పలికారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే చట్ట ప్రకారం కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. రౌడీ షీటర్లలో మార్పు రావాలని ఆకాంక్షించారు.

నేడు కలెక్టరేట్‌లో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక

కర్నూలు(సెంట్రల్): ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)ను సోమవారం కలెక్టరేట్‌లోని సునయన ఆడిటోరియంలో నిర్వహించనున్నట్లు కలెక్టర్ డాక్టర్ ఏ.సిరి ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. సమస్యలు ఉన్న ప్రజలు వినతులను సమర్పించుకోవాలని సూచించారు. అలాగే అన్ని మండల, డివిజినల్, మునిసిపల్ కార్యాలయాల్లో అధికారులు అందుబాటులో ఉండి ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తారని వివరించారు.

అర్జీల సమాచారం కోసం 1100 ఫోన్ నంబర్

పీజీఆర్ఎస్‌లో ఇచ్చిన అర్జీ పరిష్కారం కాకున్నా, పరిష్కారం ఏ దశలో ఉందో సమాచారం తెలుసుకోవాలన్నా కాల్ సెంటర్ నంబర్ 1100కు ఫోన్ చేయవచ్చని కలెక్టర్ తెలిపారు. అలాగే అర్జీదారులు meekosam.ap.gov.in వెబ్‌సైట్‌లో కూడా అర్జీలను నమోదు చేసుకోవడానికి అవకాశం ఇచ్చినట్లు వెల్లడించారు.

నగరపాలక సంస్థలో..

కర్నూలు (టౌన్) : నగరపాలక సంస్థ కార్యాలయంలో సోమవారం ఉదయం 10.30 గంటలకు ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమం నిర్వహించనున్నట్లు నగరపాలక కమిషనర్ పి.విశ్వనాథ్ ఆదివారం ఒక ప్రకటనలో తెలిపారు. నగర పరిధిలోని ప్రజలకు తమ కాలనీల్లో ఏవైనా సమస్యలు ఉంటే లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేయవచ్చని సూచించారు.